విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 01 మే 2025   8 పేజీలు

ఆప్కాస్ రద్దు...?

- ఉద్యోగులకు ప్రాణసంకటం
- జీతాలకు తప్పని పోరాటం
- ఏజెన్సీలు ముద్దు

పాలక ప్రభుత్వాలు శాశ్వత ఉద్యోగ నియామకాల విషయంలో ఎప్పుడో చేతులెత్తేశాయి. ఎందుకంటే వారికి జీతాలు, ఇతర అలవెన్సులు లక్షలలో చెల్లించాల్సి ఉంటుంది. అంత బడ్జెట్ పెట్టలేక కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్,తాత్కాలిక ఉద్యోగులను వివిధ శాఖలలో భర్తీ చేసే పనిని ఏజెన్సీలకు అప్పగిస్తూ వచ్చారు.గత ప్రభుత్వం వాటన్నింటినీ రద్దుచేసి అప్కాస్ ఏర్పాటుచేసి అన్నింటిని ఒక గొడుగు కిందకు చేర్చింది. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ, రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, ఇలా అనేక శాఖలలో వేలాది మంది తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెలా వీరికి జీతాలు సకాలంలో పడేవి. ప్రస్తుతం ఆప్కాస్ రద్దు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకుని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రజా సంక్షేమ విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు ప్రయోజనకరంగా ఉంటే వాటిని కొనసాగించడం ద్వారా కొత్త ప్రభుత్వాల గౌరవాన్ని ఇనుమడింప చేస్తాయి. అలాకాకుండా ప్రయోజన కరంగా ఉండే పథకాలను తొలగిస్తే దానితో ప్రజలలో వ్యతిరేకత మొదలవుతుంది.గతంలో వైకాపా ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించి అనేక విమర్శలకు గురైన సంగతి తెలిసిందే.ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం,వైసిపి బాటలో ప్రయాణం చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.అందుకు నిదర్శనం ఆప్కాస్ రద్దు ప్రతిపా దనల గురించి ప్రస్తావిస్తున్నారు.

దళారులకు చెక్ పెట్టిన ఆప్కాస్...

ఆప్కోస్ వల్ల తాత్కాలిక ఉద్యోగులకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. జీతాలు సకాలంలో వస్తున్నాయి.ఏజెన్సీల ఆధీనంలో ఉన్నప్పుడు వారు పెద్ద ఎత్తున కమిషన్లు,ఇతర మామూళ్ళు వసూలు చేసి తాత్కాలిక ఉద్యోగుల కడుపు కొట్టేవారు. ఆప్కోస్ రాకతో ఆ సమస్య నుంచి బయట పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం ▶మిగతా 2లో..

మత విద్వేషాలతో రాజకీయం సరికాదు

- ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాల్సిన ప్రభుత్వాలు మతవిద్వేషాలతో రాజకీయం చేయటం సరికాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. మండలంలోని మల్లారంలో సీపీఐ 17వ మండల మహాసభను రామవరం సర్పంచ్, ఉప సర్పంచ్ పిట్టా ప్రసాద్, కంగాల రమాదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహాల్గాంలో ▶మిగతా 2లో..

నేడే మేడే

- ఎర్ర తోరణాలతో రాజమండ్రి కళకళ
- సీపీఐ- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న సీపీఐ జాతీయ నేత డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర- రాజమండ్రి : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ, ఏఐటీయుసి రాజమండ్రి జట్లు లేబర్ యూనియన్ ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున మేడే ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. మే 1 ఉదయం 9 గంటలకు రాజమండ్రి జట్ల లేబర్ కార్యాలయం నుండి కార్మిక మహా ప్రదర్శన ప్రారంభం అవుతుందని ఆ ప్రదర్శన అప్సర థియేటర్, రంభ, ఊర్వశి, మేనక సెంటర్ మీదుగా సీపీఐ కార్యాలయం అక్కడ నుండి తాడితోట క్లాత్ మార్కెట్ సెంటర్ , షెల్టన్ హోటల్ మీదుగా ఆవ వాటర్ ట్యాంకర్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జాతీయ మానవ హక్కుల నేత, బార్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ళ సుబ్బారావు, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, జట్లు లేబర్ యూనియన్ కార్యదర్శి సప్ప రమణ, ఇతర కార్మిక ప్రజా సంఘాల నేతలు ప్రసంగిస్తారని మధు పేర్కొన్నారు. నగరంలో ఉన్న కార్మిక సోదరి సోదరులందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు.

శ్రమను మించిన ఆయుధం లేదు

- కార్మిక శాఖ మంత్రి సుభాష్
- ఈశ్రం పోర్టల్ కార్డుల పంపిణీ
- రామచంద్రపురంలో మేడే వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : మేడే వేడుకలు ముందస్తుగా ఒకరోజు ముందే అంగరంగ వైభవంగా జరిగాయి. మే డే రోజున మంత్రి వాసంశెట్టి సుభాష్ అమరావతిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనవలసి ఉన్నందున మంత్రి తన సొంత నియోజకవర్గమైన రామచంద్రపురంలో ముందుగానే మే డే ఘనంగా కార్మికుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికుల యూనిఫామ్ (ఖాకీ డ్రస్, మెడలో ఎరుపు తవ్వాలు వేసుకుని కార్మికులతో కలిసి మే డే ర్యాలీ (ఆటో ర్యాలీ)లో పాల్గొని కార్మికులకు అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. ఖాకీ బట్టలతో మంత్రి సుభాష్ స్వయంగా ఆటో నడిపి కార్మికుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని వెల్లడించారు. వెల్ల బ్రిడ్జి దగ్గర నుంచి ప్రారంభమైన కార్మికుల ర్యాలీ లలితా నగర్‌లోని సభావేదిక వరకు సాగింది. అనంతరం జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్మికుల కష్టంతోనే ఈ దేశ ఆర్థిక అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, వారి భవితకు భద్రత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈశ్రమ్ కార్డులు ద్వారా భీమా కల్పిస్తుంది అన్నారు. చంద్రన్న బీమా ద్వారా కార్మికులకు 10 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అనంతరం కార్మికులతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కార్మికుల పక్షాన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎప్పుడూ సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రామచంద్రపురం విజయ్ ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కడియాల రాఘవన్, కూటమి పార్టీ నాయకులు, పలువురు ఆటో యూనియన్ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

- 2,59,685 లబ్ధిదారులకు రూ.112.98 కోట్ల పంపిణీ
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్.టి.ఆర్. భరోసా పింఛను కింద జిల్లాలో మే నెలలో 2,59,685 మంది ఫించన్ దారులకు రూ. 112.98కోట్ల పంపిణీని సమర్థ వంతంగా నిర్వహించాలని ▶మిగతా 2లో..

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు

జిల్లా కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఏకగవాక్ష విధానం క్రింద గడచిన త్రైమాస కాలంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహకానికి వివిధ రాయితీల మంజూరు, పీఎం విశ్వకర్మ యోజన, క్లస్టర్ డెవలప్మెంట్ వంటి అంశాలపై కలెక్టర్..పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ▶మిగతా 2లో..

పాఠశాల పర్యవేక్షణ అధికారిగా రామ్మోహనరావు

విశాలాంధ్ర-లింగపాలెం: భోగోలులోని ప్రభుత్వ ఐ.సి.ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన పాతూరి రామ్మోహనరావు

సేవలను గుర్తించి ఈయనను పాఠశాలకు పర్య వేక్షణ అధికారిగా ఐసిఎం సంస్థ పాఠశాలల మేనేజర్, బిషప్ ఎస్. డి.ఆర్.ఎన్.జాన్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీరు పాఠశాలలో సమీక్ష నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహనరావు మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరుపొంది పదవీ విరమణ చేసిన ఈయనను పర్యవేక్షణ అధికారిగా నియమించటం పట్ల స్థానిక ప్రజలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర -టి.నరసాపురం: విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించు కోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా బుధవారం విద్యార్థులకు జాతీయ గీతాల పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకొని విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్ ద్వారా గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర- ఉంగుటూరు : స్వర్ణాంధ్ర 2047 విజన్ ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సహకారంతోనే అభివృద్ధి స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధ్యం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంతో స్వర్ణాంధ్ర కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, గణప వరం మండలాలు అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాలుగు మండలాల మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు (1వ పేజీ తరువాయి)

త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 196 దరఖాస్తులు అందగా, ఏకగవాక్ష విధానంలో ఆయా శాఖల ద్వారా 177 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, రెండు దరఖాస్తులను వివిధ కారణాల చేత తిరస్కరించామన్నారు. 17 దరఖాస్తులు వివిధ శాఖల పరిశీలనలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి పథకం (ఎంఎస్ఈసీడీపీ) కింద జిల్లాలో ప్రతిపాదించిన క్లస్టర్లు ప్రతిపాదనలను మే15 నాటికి సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, ఏడీ ఎస్ విజయ్ కుమార్, రవాణా శాఖా అధికారి జివి.శివారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణా రెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి. ప్రసాద్, సాంఘిక శాఖ ఇన్చార్జి డీడీ జి. శ్రీనివాసరావు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, జిల్లా అగ్నిమాపక, ఫ్యాక్టరీస్ ఇతర శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది సురేష్, విజయ్ కుమార్, సందీప్, వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంపిణీ (1వ పేజీ తరువాయి)

సంబంధిత అధికారులను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో మే నెల ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లపై సంబం ధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నేడు 1వ తేదీ ఉదయం గం.7లకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. 1వ తేదీ ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి 2వతేదీన పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో మే 1వ తేదీన 100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా అధికారులు అందరూ పనిచేయాలన్నారు. పింఛను పంపిణీ సమయంలో ఎటువంటి అవినీతి జరిగినా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పింఛనుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి ముందుగా నమస్కారం చేసి గౌరవం ఇవ్వాలని జిల్లాలోని అందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, మునిసిపల్ కమిషనర్ ఆదేశించారు. మే నెల ఫించన్ పంపిణీ సమయంలో ప్రభుత్వ సందేశం తప్పని సరిగా వినిపించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ కె.భీమేశ్వరరావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ తదితరులు ఉన్నారు.

సరికాదు (1వ పేజీ తరువాయి)

జరిగిన దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి తగు సహాయం అందించా లన్నారు. కేంద్రంలో పరిపాలన సాగిస్తున్న బిజెపి పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు, కార్మికులు, పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. భారతదేశంలో పౌష్టికాహార లోపంతో రక్తహీనత ఏర్పడి లక్షల మంది పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సరైన ఆహారం అందచేయాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న దేశ ప్రజలను విభజించి పాలించాలని ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. రాజ్యాంగం మార్పటంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై చూపించాలని హితవు పలికారు. అనంతరం జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసీలను ఆదుకోవాల న్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ప్యాకేజీకి అనర్హులుగా పేర్కొన్న 4,500 కుటుంబాల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల విషయంలో మానవతాదృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టడం వలన సుమారు 15 వేల ఎకరాల భూమికి నీరు అందుతుందని వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్ 3 ను అమలు చేయాలని, అన్ని సౌకర్యాలతో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ముంపులేని గ్రామాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, వేలేరుపాడు జంగారెడ్డిగూడెం కుకునూరు మండలాల కార్యదర్శులు బాడిశ రాము, జెవి రమణారాజు మైసాక్షి వెంకటాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎర్ర మధు, స్థానిక నాయకులు బంధం అర్జున్, మడివి కామయ్య, పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, కరటం సీతామహాలక్ష్మి, సోడే చిన్నమ్మ, కరక ముత్యాలు, దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు (1వ పేజీ తరువాయి)

అప్పటివరకు నిరుద్యోగ యువతను పీల్చి పిప్పి చేసిన ప్రైవేటు ఏజెన్సీలను రద్దుచేసి, అన్ని రకాల ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను ఏకగవాక్ష పద్ధతిలో ఇవ్వడానికి ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్ సర్వీసెస్)ను ఏర్పాటు చేసింది.ఆనాటి నుంచి ఔట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలలో లంచాలకు,మామూళ్లకు,దళారీలకు తావు లేకుండా పోయింది.అందులో పనిచేస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులు ప్రశాంతంగా బ్రతుకు తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆగ మేఘాల మీద ఆప్కాస్ ను రద్దు చేయడానికి పూనుకున్నది. ఈ సందర్భంగా ఆప్కాస్ నిర్వాహణలో పనిచేస్తున్న లక్షలాది మంది చిరుద్యోగుల జీవితాలు బజారున పడే ప్రమాదం ఉన్నది.

ఏజెన్సీలను పునరుద్ధరింపచేసే చర్యలను ఉపసంహరించాలి

ఆప్కాస్ రద్దు చేస్తే పాత వారందరూ ఉంటారా....! ఊడతారా...? అనే స్పష్టత లేకుండా పోతున్నది. వారికి భద్రత కల్పించకుండా మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసి రద్దుకు పూనుకోవడం సరైన విధానం కాదు. పూర్వం ప్రైవేట్ ఏజెన్సీలు, ఉద్యోగ నియామకాలలో లంచాలు,ప్రతినెలా వారికి ఇచ్చే జీతాలలో కమిషన్లు దండుకోవడం, ఇష్టారాజ్యంగా తొలగించి వారి స్థానంలో ఎవరు ఎక్కువ లంచం ఇస్తే వారిని నియమించడం లాంటి చర్యలతో కడుపులు కొట్టే సంప్రదాయం ఉండేది. ఆప్కాస్ ఏర్పాటు అయిన తర్వాత ఆ సాంప్రదాయానికి స్వస్తి చెప్పడంతో పాటు ప్రతినెల వేతనాలు వారి ఖాతాలో పడే విధంగా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 11 నెలల కాలంలో ఆప్కాస్ ద్వారా నియమించిన ఫైబర్ గ్రిడ్,ఏపీ ఐఐసి,మారిటైం బోర్డులలో పనిచేస్తున్న వందలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. చిరు ఉద్యోగులకు ఎంతో అనుకూలంగా ఉన్న ఆప్కాస్ను తొలగించి, ప్రైవేటు ఏజెన్సీలను పునరుద్ధరింపజేసే చర్యలను ఉపసంహరించుకోవాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఐక్య పోరాటాలకు సిద్ధం అయ్యే పరిస్థితి కల్పిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకోవడం వలన ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. లేదంటే మరో రాష్ట్ర వ్యాపిత ఉద్యమాన్ని కూటమి ప్రభుత్వం ఎదుర్కోక తప్పదు.

9 నుంచి భారత దళిత సేన కార్యవర్గ సమావేశాలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : భారత దళిత సేన (బి డి ఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు మే నెల తొమ్మిదో తేదీన విజయవాడ అంబేద్కర్ భవన్లో ప్రారంభమవుతాయని

భారత దళిత సేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఈ.బి.స్వామి ,జాతీయ కార్యదర్శి డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రియదర్శిని కళాశాలలో భారత దళితసేన జాతీయ కార్యవర్గ సమావేశాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఈ.బి స్వామి మాట్లాడుతూ జాతీయ కార్యవర్గ సమావేశాలకు ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో దేశంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా "పహల్ గాం" ఉగ్రదాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది. బీడీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ జాన్ ప్రసంగి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు సరెళ్ళ విజయ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఐ ఆర్ ఎస్ అధికారి మహేష్ రాజు, ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షులు బిషప్ రత్న కుమార్ ఈ సమావేశాలకు అధ్యక్ష వర్గంగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుండి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడిఎస్ యువజన విభాగం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు గుడిపాటి వెంకటేశ్వరరావు, కాటం ప్రసాద్, బాతుల వేణు బొడేటి సత్యనారాయణ, ఎం.రమ్య, జోడాల గిరిబాబు, బి.వెంకటేశ్వర రావు, గంజి మరియమ్మ, రాజు, రవి, జ్యోతి, కిషోర్ ,తదితరులు పాల్గొన్నారు.

వెబ్ సైటులో గురుకుల ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరమునకు జూనియర్ ఇంటర్మీడియేట్ ప్రవేశానికి మే నెల 4వ తేదీ ఉదయం గం.10 నుండి గం.12:30 వరకు పరీక్ష నిర్వహించనున్నారని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్స్ వెబ్ సైటులో https://mjpapbcwreis.apcfss.in అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్ సైటు నుంచి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకుని మే నెల 4వ తేదీ ఉదయం గం.9లకు పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

పోలీసుల పల్లెనిద్ర

విశాలాంధ్ర-లింగపాలెం: యడవల్లిలో పోలీసులు రాత్రి బస చేశారు.చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న బాబు, సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ జయరాజు పోలీసు సిబ్బంది పల్లెనిద్రలో

పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా సిఐ ప్రజలతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, సారా తయారీని విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కోరారు.ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని తెలిపారు. జూదక్రీడలకు ప్రజలు దూరంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో అందరూ విద్యా వంతులు కావాలనే లక్ష్యంతో పిల్లలను చదివించాలని ఈయన కోరారు. గ్రామ అభివృద్ధిలో సమిష్టిగా అందరూ తమ వంతు సహకారం అందించుకోవాలని అన్నారు.గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని సిఐ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్ పరీక్ష

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: పాలిసెట్ 2025 పరీక్ష బుధవారం నూజివీడు పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది. అధికారులు పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ ఉన్నత పాఠశాల,

బాలికోన్నత పాఠశాలలో రెండింటిలో కలిపి పోలిసెట్ 2025 నిర్వహించారు. 770 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 699 మంది విద్యార్థులు రాశారు . వీరిలో బాలురు 452 మంది కాగా బాలికలు 257 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మామిడిశెట్టి

విశాలాంధ్ర -భీమవరం: భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భీమవరంనకు చెందిన ఎం.లక్ష్మీగణపతి నియమితులయ్యారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఏప్రిల్ 26, 27వ తేదీల్లో జరిగిన ఇస్కఫ్ రాష్ట్ర మహాసభల్లో లక్ష్మీగణపతి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు భీమవరం రూరల్ తాడేరుకు చెందిన షేక్ చాన్ భాషా రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎ.పి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్ తదితరులు లక్ష్మీగణపతి, షేక్ చాన్ భాషాలను అభినందించారు.

పదవీ విరమణ ఉద్యోగికి పిఎఫ్ సొమ్ము అందజేత

విశాలాంధ్ర- ఏలూరు : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఎండీ ఉస్రాన్‌కు చెందిన ప్రావిడెంట్ ఫండ్ నగదు 2 లక్షల 14 వేల రూపాయల చెక్కును నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. నగరపాలక సంస్థలో ఎన్నో సేవలు అందించిన ఎండి ఉస్రాన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పదవీ విరమణ చెందిన వెంటనే అతనికి మున్సిపల్ కార్యాలయం నుండి అందాల్సిన పూర్తి మొత్తాన్ని అందజేసినట్టు మేయర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్. పెదబాబు, డిప్యూటీ మేయర్ పప్పు ఉమా మహేశ్వరరావు, మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: వేసవి సెలవులను వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని మానవతా సంస్థ భీమ వరం శాఖ అధ్యక్షులు పూనా రాము అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో

భాగంగా బుధవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షపై తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులందరూ గ్రంథాలయాల నుంచి వెళ్లిన వారేనని వారి స్ఫూర్తితో విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. తొలుత మానవతా సంస్థ సౌజన్యంతో విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యస్.వెంకటేశ్వరరావు, ట్రైనర్స్ ఎం.డి. సరోజిని, జె.శ్యామ్, సంఘ సేవకులు అల్లు శ్రీని వాస్, ఇందుకూరి శివాజీ వర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - భీమవరం: మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలి

వేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దాహార్తిని తీర్చేందుకు దాతలు ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మరింతమంది ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

శ్రీశ్రీ రచనలు అజరామరం

అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల

విశాలాంధ్ర -భీమవరం: ప్రజల్లో సామాజిక స్పృహ కల్పించడానికి శ్రీశ్రీ అభ్యుదయ రచయితగా ఎనలేని సేవ చేశారని అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం శ్రీశ్రీ 115వ జయంతి భీమవరంలో అరసం, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వ ర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వేల్పుల నాగేశ్వరరావు మాట్లా డుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయా లను ,అసమానతలను వెలికి తీసి కథలు, కవితలు, నాటకాలు,వ్యాసాల రూపంలో ప్రజలకు అందించిన గొప్ప అభ్యుదయ రచయిత శ్రీ శ్రీ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి పగో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లా డుతూ సమాజానికి అద్దం పట్టే రచనలు చేయుటం శ్రీశ్రీకే చెల్లిందని ఆయన హేతువాదిగా, వామపక్ష వాదిగా నిరంతర కృషి చలుదన్నారు. సమాజంలో జరుగుతున్న రుగ్మతలను వెలుగు తీసి ప్రజలను చైతన్య వంతులు చేయడానికి ఆయన చేసిన కృషి అభినందనీయమని అన్నారు. తొలుత శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకుడు చాంద్ బాషా, అరసం నాయకులు మల్లుల శ్రీనివాస రావు, ముస్తఫా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రమజీవులపై రాజకీయ వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర -పెంటపాడు : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ వికాస శ్రామికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామీణ వికాస శ్రామికుల పై అధికార మార్పిడి జరిగిన తర్వాత వేధింపులు ఎక్కువయ్యాయని దీనిని తక్షణమే ఆపాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు.

బుధవారం ఆయన పెంటపాడు మండలంలో వివిధ గ్రామాలలో పని ప్రదేశంలో పనిచేస్తున్న గ్రామీణ వికాస శ్రామికులను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా అనేక విషయాలు శ్రామికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ 2005లో యూపీఏ ప్రభుత్వం పై వామపక్షాలు, 64 మంది ఎంపీలు, ప్రజా సంఘాలు ఒత్తిడి తీసుకొని రావడం వల్ల యూపీఏ ప్రభుత్వం ఈ చట్టం 2005లో తీసుకొని వచ్చిందని అన్నారు. ఇది పేద ప్రజలకు, గ్రామీణ కార్మికులకు నిరుద్యోగ భృతిగా ఉపయోగపడు తుందనే ఉద్దేశంతో ఆ రోజు ఈ చట్టం తీసుకొచ్చారని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఈ చట్టానికి గ్రామీణ శ్రామికులకు కేటాయించవలసిన రూ.మూడు లక్షల 50 వేల కోట్లు బదులు 95 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ చట్టం రాజకీయాలకు అతీతంగా ఉన్నప్పటికీ గ్రామాలలో ఈ విధంగా చేయడం మంచిది కాదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వికాస శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర- బుట్టాయిగూడెం ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా రెండురోజులపాటు గిరిజన ప్రాంతాలలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్. తన పర్యటనలో భాగంగా ఈనెల 23వ తేదీన బుట్టాయిగూడెం మండలం పులిరామిడిగూడెం పర్యటించగా అక్కడి ప్రజలు తమకు త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ వెంటనే ఆ ప్రాంత గిరిజనుల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకోవాలని, అంతవరకూ ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని, ఐ.టి.డి. ఏ. ప్రాజెక్ట్ అధికారిని, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారు లను మంత్రి మనోహర్ ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు ముందుగా వెంటనే ఇంటింటికి రక్షిత త్రాగునీటిని ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా గ్రామ పంచాయితీ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.2. 50 లక్షలు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించాలని

మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాలతో పాటు జిల్లాలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 971. 80 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.వీటిలో గ్రామ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ కింద 501.43 లక్షలు,మండల ప్రజా పరిషత్తులకు 270.37 లక్షల నిధులు ఉన్నాయి.వాటి ద్వారా హ్యాండు పంపుల మరమ్మత్తులు, రక్షిత మంచినీటి పథకాల మరమ్మతులు కొనసాగుతున్నాయి. పోలవరం నియోజకవర్గ గిరిజన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించేందుకు 15వ కమిషన్ గ్రాంట్ కింద 41.55 లక్షలు, మండల ప్రజా పరిషత్ ఫైనాన్స్ నిధుల కింద 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి.గిరిజన ప్రాంతాలలో త్రాగునీటి సమస్యకు లక్షలాది రూపాయలు మంజూరు చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పులిరామిడుగూడెం ప్రజలు తమ కృతజ్ఞతలను తెలియజేస్తున్నారు.

దాళ్వా వరి సాగు ఆశాజనకం

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో పండించిన దాళ్వా వరి సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షాలు

అధికంగా పడటం, చెరువులలో నీరు ఉండటంతో దాళ్వా సాగు చేయటానికి ఉపయోగపడ్డాయని రైతులు అంటున్నారు. యడవల్లి, ధర్మాజీగూడెం,టి.సి. హెచ్.ఆర్.పాలెం, కలరాయనగూడెం, అయ్యపరాజుగూడెం, ఆసన్నగూడెం, వేములపల్లి, కే.గోకవరంలో రబీలో 2వేలఎకరాలకు పైగా దాళ్వా పంట పండించారు. పంట ఆశాజనకంగా ఉండటంతో మండలం మొత్తం మీద 6000 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు రైతులకు ఎదురు కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

మేడే ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-పెదపాడు: మేడేను పంచాయతీ కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి. కిషోర్ పిలుపు నిచ్చారు. 139 వ మేడే వార్షికోత్స వాల్లో భాగంగా పెదపాడు మండ

లంలో అప్పనవీడు, ఏపూరు పంచాయతీ కార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్. శ్రీనివాస్ డాంగే, పి.కిషోర్ మాట్లాడుతూ సమాజంలో శ్రామికులకు ఎనిమిది గంటల పని హక్కు కోసం 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికుల వీరోచిత పోరాటమే మేడే అన్నారు. .గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 010 (జీరో వన్ జీరో) పద్దు ద్వారా ప్రభుత్వమే జీతాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ

విశాలాంధ్ర -భీమవరం: కోర్టు భవన సముదాయం అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఐఎల్ ఆధ్వ ర్యంలో డిఎన్నార్ న్యాయ కళాశాల

అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం పాకా సత్యనారాయణ ను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన న్యాయవిద్యార్థిగా, అడ్వకేట్ గా తన అనుభవం, అనుభూతులను, రాజకీయ ఎదుగుదల తదితర అంశాలను వారితో పంచుకున్నారు. డిఎన్నార్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురామ్, ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, ఎ.అశోక్ కుమార్, ఎం.కిరణ్ కుమార్, ఎం.చిత్రభాను, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులుగా జెట్టి గుర్నాధరావు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులుగా జంగారెడ్డిగూడెం ప్రాంత ప్రముఖులు జెట్టి గురునాధరావును నియమించడం పట్ల ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,జెట్టి గురునాధరావు అభిమానులు హర్షం వెలిబుచ్చుతూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు బుధవారం జగన్మోహన్ రెడ్డిని విజయవాడ, తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల నాయకులు వీరవెల్లి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన స్వాగతిస్తున్నాం : ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : దేశంలో కులగణనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. వచ్చే జనగణనలో కుల గణన అంశాన్ని చేర్చాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని అభిప్రాయం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఆమోదించడం ద్వారా కులగణన విషయంలో కేంద్రం లోని ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధి రుజువైందని అన్నారు. కులగణనను కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాయని, ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆచరణలో చూపిందని చెప్పారు. కులగణన చేపట్టడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, ప్రభుత్వ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరడానికి వీలుందని తెలిపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

ఎంఎల్ హెచ్‌పిల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

ఏపీఎన్జీవో డిమాండ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నేషనల్ రూరల్ హెల్త్ మిషన్లో పనిచేస్తున్న హెల్త్ ప్రొవైడర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది.

2017వ సంవత్సరంలో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ నిధులతో బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుమారు 400 మందిని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఎంఎల్ హెచ్ పి/సిహెచ్‌ఓలుగా నియమించారు. వీరికి రావాల్సిన న్యాయమైన రాయితీలు అందకపోవడంతో సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్డెక్కారు. ఇందులో భాగంగానే ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరవధికంగా ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ హెచ్ పి జిల్లా నాయకత్వం ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను కలిసి మద్దతు కోరారు. దీంతో బుధవారం ఏపీఎన్జీవో అసోసియేషన్, జెఏసి పక్షాన జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ధర్నా శిబిరానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పిల సర్వీసు గ్రామాల్లో చాలా ముఖ్యమని, వారికి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి రామారావు మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్స్‌తో సమానంగా ఒక్క సర్జరీ మినహాయించి అన్ని మెడికల్ డ్యూటీలు చేస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న ఎంఎల్ హెచ్ పి సరైన గుర్తింపు లేదని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు నోరి శ్రీనివాస్, ఏలూరు తాలుకా కార్యదర్శి కప్పల సత్యనారాయణ, ఎన్జీవో సంఘ నాయకులు వి.గంగాధర్, కెఎస్ ఆర్.మోహన్, హరినారాయణ, బైగ్, లేగల వెంకటేష్, ఎంఎల్ హెచ్ పి అసోసియేషన్ నాయకులు సురేంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో మే 4న నీట్ యూజీ- 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు, సూపరింటెం డెంట్లు, విద్యాశాఖా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం రెండు సెంటర్లను తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో నీట్‌లో ఒక పరీక్ష కేంద్రం, శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 2100 మంది విద్యార్థులు హాజరవుతా రన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుండి 5.00 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11.00 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను సూపరింటెం డెంట్లు, పోలీసు సహకారంతో తీసుకు రావాలని కలెక్టర్ సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులైన టాయిలెట్స్, త్రాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. గూగుల్ మీట్ లో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డిఇఓ ఇ. నారాయణ, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శివన్నారాయణ రెడ్డి, పోలీసు డిపార్ట్మెంట్ నోడల్ అధికారులు ఎస్సైలు పి.నాగరాజు, జేవిఎన్ ప్రసాద్, కే శ్రీనివాస్, ఆర్. బెన్నీ రాజు, సూపరింటెండెంట్స్ డాక్టర్ మాచవరపు రాముడు, డాక్టర్ జె కృష్ణమూర్తి, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ ఆర్ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అక్షయ తృతీయ పురస్కరించుకుని బుధవారం మల్లేశ్వర స్వామి కి లక్ష మల్లెపూలతో ఘనంగా పూజ నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శోభనాద్రి తెలిపారు. స్వామివారికి మల్లె పూలతో పూజ అమ్మవారికి కుంకుమ పూజ అర్ధవరం గ్రామానికి చెందిన నాగేంద్ర ప్రసాద్ ఆర్థిక సహాయంతో నిర్వహించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కలిదిండి సూర్య రామకృష్ణంరాజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

DOCUMENTS LOST

STATE BANK OF INDIA HOUSING BOARD COLONY BRANCH, **Bhimavaram** W.G.District,AP. this to infrom that document No. **3248/2007** dt.26.07.2007 and **2610/2008** dt. 22.12.2008 pertaining **Boina China Venkanna** is missing for 11.04.2025 from our AMCC Bhimavaram , Hence any person who finds these documents may handover the same to state Bank of India , Housing board colony branch , Bhimavaram

Cell : 9704028365

ప్రశాంతంగా పోలీసెట్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో పోలీసెట్ ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

బుధవారం భీమవరం విష్ణు కాలేజీ, బి.సీతా పాలిటెక్నిక్ కాలేజీల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాయడాన్ని స్వయంగా పరిశీలించారు. విష్ణు కాలేజీ సెంటర్‌కు ఎంతమందిని కేటాయించారు, ఎంతమంది హాజరయ్యారు తదితర వివరాలను చీఫ్ కోఆర్డినేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసెట్ -2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం 18 సెంటర్లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని, వీటిలో భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, తణుకులో 8, నరసాపురంలో 4 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 4,354 మంది విద్యార్థులు, 2,917 మంది విద్యార్థినులు మొత్తం 7,254 మంది పోలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 6,489 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ సిహెచ్ నల్లపురాజు, సహాయ కోఆర్డినేటర్ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రజాధనం నిరుపయోగం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: తల్లాడ నుండి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వరకు నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిలో భాగంగా కొయ్యల గూడెం పట్టణంలో షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంతంలో రహదారిపై ఏర్పాటుచేసిన బస్సు షెల్టర్ నిరుపయోగంగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది.

బస్సు షెల్టర్ నిర్మించిన ప్రాంతంలో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా లేకపోవడమే ప్రధాన కారణం. ఆర్టీసీ బస్సుల వారు కూడా బస్సు షెల్టర్ ప్రాంతంలో బస్సులను నిలుపుదల చేయకపోవడం కూడా కారణమే. పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో బస్సు షెల్టర్ నిర్మించి ఉంటే, ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉపయోగపడేది, ప్రయాణికుల తాకిడి లేని ప్రాంతంలో బస్సు షెల్టర్ నిర్మించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం నిరుపయోగం అవుతుందని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత జాతీయ రహదారి అధికారులు బస్ షెల్టర్ ను ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పోలీసుశాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : అంకిత భావంతో పోలీసు శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు ఎస్పీ శ్రీ వి. భీమారావు పేర్కొన్నారు.

ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ఆదేశాల మేరకు బుధవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందిన సబ్ ఇన్స్పెక్టర్ కె. కొండలరావు, హెడ్ కానిస్టేబుల్స్ కె. భాస్కరరావు,సిహెచ్. విశ్వేశ్వరరావులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు విశేష సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న సిబ్బందికి, ముందుగా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్స్పెక్టర్ వి.పుల్లారావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) డి.సురేష్, పోలిసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సి. హెచ్.మోజెష్, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్,
కొసమట్టం సిటీ సెంటర్, ఫ్లోర్ నెం. 4 అండ్ 5,
టి.వి. రోడ్డు, కొట్టయమ్, కేరళ-686001

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్.,

ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా ఇక్కడ కొసమట్టం ఫైనాన్స్‌లో బంగారం మీద ఋణం, వడ్డీ కట్టక గడువు సమయం మించిపోయిన బంగారము క్రింద తెలుపబడిన జి.యల్.నెంబర్ల ప్రకారం బహిరంగంగా వేలం వేయుచున్నాము. ఈ వివరములు ముందే మేము మీకు రిజిష్టరు లెటర్స్ ద్వారా తెలిపియున్నాము. ఇదే వివరాలు ఏదైనా బ్రాంచిలో వేలము వేయుచున్నామో అదే బ్రాంచిలో జి.యల్.నెంబర్ల ప్రకారం నోటీసు బోర్డులో పెట్టడం జరిగింది.

బంగారం వేలం వేయు స్థలం : వేలం వేయు బంగారం వివరములు :

పశ్చిమగోదావరి పరిధి : కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్, తాడేపల్లిగూడెం బ్రాంచి, డోర్ నెం. 2-1-37, మొదటి అంతస్తు, కోస్టల్‌ఏరియా బ్యాంకు పైఅంతస్తు, కె.ఎన్.రోడ్, మెయిన్ రోడ్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, పిన్: 534 001. **ఫోన్: 08818- 224423. తేది: 16-05-2025, సమయం: ఉదయం 9:30 గంటలకు.**

ఏలూరు : 8607 8630 8631 8656 8677 8741 9567 9591 10002 10084 10092. **కొయ్యలగూడెం** : 16514 16538 16547 16564 16599 16640 16662 16681 16685 16737 16742 16775 16797 16798 16812 16824 16827 16855 16883 16912 16952 16976 16984 17000 17001 17006 17023 17596 17608 17619 17637 17646 17648 17649 17655 17656 17670 17673 17675 17681 17689 17716 17717 17718 17723 17778 17779 17780 17802 17808 17839 17840 17842 17847 17855 17856 17883 17884 17886 17887 17892 17906 17908 17915 17938 17966 17995 18006 18046 18062 18104 18119 18154 18163. **నిడదవోలు** : 13762 13798 13827 13889 13898 13952 14005 14269 14287 14363 14472 14477 14478 14498 14512 14537 14541 14611 14687 14737 14756 14760. **తాడేపల్లిగూడెం**: 13075 13419 13420 13518 13521 13688 14683 15068 15082 15112 15179 15188 15194 15322 15363 15546 15563 15571 15602 15713 15785 15797 15815 15819 15831 15832 15916 15924. **తణుకు** : 11706 11793 11864 11865 11956 11969 12476 12659 12721. **పాలకొల్లు** : 7933 7934.

నోట్: 1) వేలంలో పాల్గొనదలచినారు రూ. 1,00,000/- కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్ పేరుపైన ఆర్‌టిజిఎస్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఉ. 11. గం. లోపు డబ్బు డిపాజిట్ చేయాలి. వేలం తరువాత ఎవరు డిపాజిట్ చేస్తారో వారికి డబ్బు వెనక్కి ఇవ్వబడును. **(2)** వేలానికి వచ్చినవారు గుర్తింపు కార్డు, లే రెసిడెన్స్ ప్రూఫ్ కచ్చితంగా తీసుకుని రావాలి. లిస్ట్‌లో వున్న మొత్తం బంగారం చెప్పినరోజు వేలం వెయ్యకపోతే మరుసటి రోజు ఆఫీసు పనిచేయు వేళల్లో బంగారు వేలం వేయడానికి, వేలం సమయాన్ని ఎటువంటి నోటీసు ఇవ్వకుండా మార్చడానికి మా కంపెనీకి పూర్తి అధికారం ఉంది. వేలంలో బంగారం తీసుకున్న వారు 5 శాతం అదేరోజు కట్టాలి. ఒక వారం రోజులలో మిగతా నగదు కట్టి బంగారం తీసుకుని వెళ్ళాలి. తేదీ, స్థలం మార్చుటకు కంపెని వారికి సర్వహక్కులు కలవు. పూర్తి వివరాల కోసం **15-05-2025**వ తేదీ లోపు సంప్రదించగలరు. ఫోన్ : **0866-2435456**

తేది: **01-05-2025** విజయవాడ. అథరైజ్డ్ ఆఫీసర్, కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా ముత్యాల అనిల్ నియామకం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రెల్లి పేటకు చెందిన ముత్యాల అనిల్ కుమార్‌ను దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ప్రతిపాదించారు. ఈ మేరకు రైల్వే శాఖ వారు అయన నియామకాన్ని ధ్రువీకరిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బలహీన వర్గానికి చెందిన తనని మొట్టమొదటి సిఫారసు ద్వారా ఇంత గొప్ప అవకాశం కల్పించడం సతీష్ బాబు గొప్ప మనసుకు నిదర్శనం అని, ఇచ్చిన బాధ్యతను పూర్తి స్థాయిలో వియోగించి ప్రజలకు రైల్వే బోర్డు మధ్య వారధిగా ఉండి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ప్రయత్నిస్తా నన్నారు. ఈ సందర్భంగా కోప్పవరం ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద అనిల్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస్ (బున్ని), ఆఫీస్ ఇంచార్జి మేకా లక్ష్మణమూర్తి, బండి నరేంద్ర, సాయిబాబా, బర్ల శ్రీనివాస్, దుర్గాప్రసాద్, సతీష్ శ్రీమన్నారాయణ, సాయి మరియు రెల్లి సంఘం నాయకులు సత్యం, జోగరాజు, ఆకుల గోపి, బంగారు సత్తిబాబు, సోమజుల గోవిందు, కస్తూరి నూకరాజు, బండి లక్ష్మీనారాయణ, రాళ్లపూడి జయ, వడ్డి పోలమాంబ రెల్లి కుల పంచాయతీ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కిశోర్ వికాశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర -తాళ్లపూడి : కిశోర్ బాలికలు మానసిక ఎదుగుదలకు విద్యాలయాలు, ఉపాధ్యాయులతో పాటు తల్లి తండ్రులు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో కిశోర్ వికాసం అనే కార్యక్రమం పై మండల స్థాయి కమిటీ అద్వర్యంలో సమావేశం జరిగింది. గ్రామ స్థాయి కమిటీలు ఆద్వర్యంలో ప్రతి గ్రామంలోను కిశోర్ బాలికలుతో వారానికి రెండు సార్లు సమావేశాలు జరపాలని సూచించారు. కిశోర్ బాలికలు ప్రవర్తన, పాటించాల్సిన విధానాలు గురించి తెలియ చేయాలని, సోషల్ మీడియాకి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ పరంగా ఆర్థిక పరిపుష్టి కోసం నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో బాగా స్వామ్యం చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, ఎంఇఓ-2 నెహ్రూజీ, అంగన్వాడీ సూపర్ వైజర్లు భాగ్య కుమారి, భానుమతి, ఏ.పి.ఎం మంగాయమ్మ తదితరులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- రూ.2.34 కోట్లతో సైఫాన్ నిర్మాణ పనులు ప్రారంభం
- కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం వద్ద పొలాలు ముంపుకు గురి కాకుండా శ్రీ వెల్ సైఫాన్ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు సమయాల్లో రైతుల వెతలు తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.2.34 కోట్ల స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ నిధులతో ఈ పనులు లొల్ల, వాడపల్లి, ర్యాలీ గ్రామాల మీదుగా జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సైఫాన్ అభివృద్ధి పరచడం వల్ల రైతులకు మేలు జరగనుండటంతో ఆ గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కరుటూరి నరసింహారావు, సర్పంచులు కాయల జగన్నాధం, మెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుభాషిణి పదవీ విరమణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : 1989లో సమాచార శాఖలో జాయిన్ అయి సుమారు 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసి సహాయ సంచాలకులుగా కొత్తూరు సుభాషిణి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా యం. లక్ష్మణా చార్యులు రాష్ట్ర సమాచార కేంద్రం ఇంచార్జీ సహాయ సంచాలకులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.. పదవీ విరమణ చేసే సమయంలో తమ కుటుంబ సభ్యుల మనోభావాలు వ్యక్తం చెయ్యడం జీవితకాలం గుర్తించే గొప్ప అనుభూతిని కలిగించిందని కే. సుభాషిణి పేర్కొన్నారు. ఎంతో అప్యాయతతో పదవీ విరమణ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పదవీ విరమణ కాలం పూర్తి ఆయురా రోగ్యాలతో విలసిల్లాలని పేర్కొన్నారు. సహాయ సంచాలకులుగా అదనపు బాధ్యతలను స్వీకరించిన డివిజనల్ పౌర సంబంధాల అధికారి యం. లక్ష్మణా చార్యులుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఏ డి ఎమ్. లక్ష్మణా చార్యులు , జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సీహెచ్. శ్రీనివాస్, సమాచార శాఖ లైబ్రేరియన్ యూ. శేఖర్, సిబ్బంది కే. శాంత కుమారి , సిహెచ్ రామక్రిష్ణ, కె. స్వామి శేఖర్, పి. వెంకటేశ్వర రావు, జయరాజు,. బి వి రమణ, నాగిరెడ్డి, వర్మ, బుల్లియమ్మ, జానీ, దుర్గా రావు, ప్రేమ్ చంద్, సుభాషిణి కుటుంబ సభ్యులు నన్నయ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు గద్దె కోటినాగులు, సైనీ, మిస్సి, డానియల్, పుష్ప లత, విజయ్ కుమార్ , చంద్ర కాంత్ , ఆనంద్ , తదితరులు హాజరై అభినందనలు తెలియ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : ప్రజా సమస్యల పరిష్కా రానికి కృషి చేసినప్పుడే ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్న ప్రజలకు ఒక తృప్తి కలుగుతుందని ఎంపిటిసిలను ఉద్దేశించి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడివో రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ దాసు అధ్యక్షతన జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ సమావేశంలో కొంతమంది ఎంపీటీసీలు సమస్యలు లేవనెత్తడం జరిగిందని అధికా రులు సమాధానం చెప్పడం జరిగిందని సాధ్యమైనంత వరకు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగు తుందని తెలిపారు. గత పాలనలో అవగాహన లేమితో ఆర్ అండ్ బి రోడ్లను బ్లాక్ లిస్టులో పెట్టారన్నారనడం హాస్యస్పదమని తప్పు జరిగితే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతారు కానీ ఎక్కడా రోడ్లు బ్లాక్ లిస్టులో పెట్టరంటూ అందుకే ప్రజలు వారిని బ్లాక్ లిస్టులో పెట్టారంటూ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో, ఈ పది నెలల్లో జరిగిన అభివృద్ధిపై సమీక్షించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు.య నియోజకవర్గ ప్రజలకు ఎంతో అవసరమైన జన్మభూమి ఎక్స్ప్రెస్ హాల్ట్ కి గట్టిగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'శ్రీ శ్రీ' సాహిత్యం ఆధునిక యువతకు స్ఫూర్తిదాయకం



విశాలాంధ్ర - కడియం : శ్రీ శ్రీ సాహిత్యం ఆధునిక యువతకు స్ఫూర్తినిస్తుందని, నేటితరం శ్రీశ్రీ కవితలు చదవాలని చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం కడియం శాఖా గ్రంథాలయంలో అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సాంప్రదాయ పద్ధతుల్లో సాగుతున్న తెలుగు కవిత్వాన్ని, సాహిత్యాన్ని ఆధునిక త్రోవకు మళ్ళించిన నవీన కవితా సారధి శ్రీశ్రీ అన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి విద్యార్థులకు వేసవి తరగతులలో భాగంగా పిల్లలు మెచ్చిన కదలను విద్యార్థులతో చదివించారు. కడియం మండల నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, ప్రముఖ రైతు నాయకులు బోణం సత్యనారాయణ, కళ్యాణం సూరిబాబు ఎమర్జెన్సీ సమయంలో శ్రీ శ్రీ ఎదుర్కొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీ శ్రీ కవితలను సభారంజకంగా పఠనం చేశారు. వేదిక్ గణితంలో విద్యార్థులకు శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రము ఖులు ముగతా లంకేశ్వరరావు, వేములూరి భాస్కరరావు, గారపాటి తాతబ్బాయి, రామారావు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమోహన్

విశాలాంధ్ర - అల్లవరం : ఆంధ్రప్రదేశ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎంపిడిఓల సంఘం డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూనిట్ కార్యవర్గంను బుధవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద జరిగిన సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గం : అధ్యక్షులు : బి ఎస్ ఎస్ ఎస్ కృష్ణ మోహన్ (అల్లవరం), ఉపాధ్యక్షులు : కె సత్య నారాయణమూర్తి (మండపేట), ప్రధాన కార్యదర్శి : కెవి ప్రసాద్ (పి గన్నవరం), కోశాధికారిబీ బికెఎస్ఎస్‌వి రామన్ (ఆత్రేయ పురం), ఆర్గనైజింగ్ కార్యదర్శి : కె వెంకటేశ్వర రావు (మామిడి కుదురు), మహిళా కార్యదర్శి : కె పద్మజ్యోతి(రామచంద్ర పురం), జాయింట్ సెక్రెటరీ : ఎస్‌వి చలం(కాట్రేనికోన) ఎన్నికయ్యారు.

నల్లా పవన్‌కి నీతిపూడి పురస్కారం

విశాలాంధ్ర - అమలాపురం : మమతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పి గన్నవరం నియోజకవర్గం పి గన్నవరం గ్రామంలో మాన్యశ్రీ నీతిపూడి గణపతిరావు సేవా పురస్కారం మహోత్సవంలో నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్‌కి ఆయన చేస్తున్న సేవలకు ఆయనను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, మమత స్వచ్ఛంద సేవా సమితి నాయకులు, నీతిపూడి గణపతి రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : 3వ రోజు వేసవి విజ్ఞాన తరగతులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి VLNSV ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులచే ఉదయం 8 గంటల నుంచి 9 గంటల కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై వీ సత్య బాల శిక్షణ ఇచ్చారు. 9 గంటల నుండి 10:30 గంటల వరకు రిటైర్డ్ విశ్రాంత ఉపాధ్యాయులు దీ సూర్యనారాయణ మాస్టారు విద్యార్థులకు ఓరిగామి, పేపర్ క్రాఫ్ట్ కోర్స్ పై శిక్షణ యిచ్చారు. 10:00 గం.ల నుండి 10:10 వరకు విరామం. 10:10 గం.ల నుండి 11 గం.ల వరకు ఉపాధ్యాయులు ఖ అనిల్ విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది రాజు, నాగేంద్ర కుమార్, దుర్గా ప్రసాద్, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం : మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : ప్రపంచ కార్మికుల దినోత్సవం ముందస్తు మే డే రోజున రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికులు, తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి కొన్ని వరాలు ప్రకటించారు. అందరికీ ఆరోగ్యం అందాలనే ఉద్దేశంతో రామచంద్రపురం నియోజవర్గంలో వైద్య సేవలు అందించేందుకు మూడు బస్సులను త్వరలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు వైద్య సేవల కోసం, ముఖ్యంగా హృదయ సంబంధ వ్యాధులతో బాధపడే వారికోసం, తక్షణ వైద్య సేవలు అందేలా ప్రాథమిక చికిత్స అందించి వారిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ/రాజమహేంద్రవరం తరలించేందుకు రెండు బస్సులను సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం మరో బస్సును కూడా త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తోటపేట గ్రామానికి చెందిన కోటిపల్లి ప్రేమవతికి రూ.15 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న గుబ్బల కామేశ్వరరావుకు రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సహాయం మొత్తం రూ.25 వేలు అందించి తన మానవత్వం మరోసారి చాటుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కార్మికుల సమక్షంలో హామీ యిచ్చారు.

ధాన్యం నిల్వలు పరిశీలన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటలో ధాన్యం స్టాక్ పాయింట్లను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. బుధవారం సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న రైతు ధాన్యం స్టాక్ పాయింట్లు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని అన్నారు. రైతులు కంటే జగదీష్ మోహన్, పైని శ్రీనివాసరావు సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారిని సత్య జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వెంట ఉండగా రైతులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ఓ సంచలనం : ప్రసన్న శ్రీ

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగు సాహితీ సాహిత్య లోకంలో శ్రీశ్రీ ఓ సంచలనం అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. విప్లవ కవి, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా,విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా ప్రసిద్ధి గాంచిన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జయంతి వేడుకలు మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నందు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తన పదునైన మాటలతో కుదిరితే పరిగెత్తు లేకపోతే నడువు అదీ చేతకాకపోతే పాకుతూ పో అంతే కానీ ఒకే చోట అలా కదలకుండా ఉండిపోవద్దు అంటూ శ్రీశ్రీ సమాజాన్ని చైతన్య పరుస్తూ వ్రాసిన అక్షరాలు అస్త్రాలుగా పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ఆచార్య డి. జ్యోతిర్మయి,తెలుగు శాఖ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్. డి.లక్ష్మి నరసమ్మ, విభాగ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌తో ఆర్థిక వనరులు

విశాలాంధ్ర - రాజానగరం : కుటుంబ ఆర్థిక వనరులు సృష్టించుకోవడానికి బోటిక(మగ్గం వర్క్) ఎంతో దోహదపడుతుందని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలం లోని దివాన్ చెరువు గ్రామంలోని సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగపేట మండలం కోటపాడు గ్రామంలో,కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామాల్లో కొన్ని రోజులుగా అందించిన ఉచిత మగ్గం వర్క్, ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సంస్థ అధినేత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడే తత్వం ఉండి మగ్గం వర్క్, కుట్టు మిషన్ నేర్చుకోవాలి అనే సంకల్పం ఉంటే ఏ గ్రామంలోనైనా తమ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా సాధన చేయాలని అప్పుడే మగ్గం వర్క పై తర్ఫీదు పొంది మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కోటపాడు గ్రామంలో 60 మంది మహిళలు, గండేపల్లి గ్రామంలో దాదాపు 40 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. గండేపల్లి గ్రామంలో సత్య మౌనిక శిక్షణ అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె. మీనా,నాగమణి, వీరరాఘవ,ఆయా గ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కిశోర బాలికలు

విశాలాంధ్ర గోపాలపురం : బాల్యవివాహాలను నిరోధించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కిశోర బాలికలను రూపొందించడమే కిషోరీ వికాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని సిడిపిఓ కే నాగలక్ష్మి తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం మండల పరిధిలోని అంగనవాడీ ఆశా వర్కర్లు వీఆర్వోలతో కిషోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి వారం మంగళ శుక్రవారం గ్రామస్థాయిలో 11 సం నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికలను సమావేశపరిచి బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలను గూర్చి తెలపాలన్నారు. యుక్త వయస్సు వచ్చేవరకు వివాహాలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. పౌష్టికాహార లోపం వల్ల రానున్న కాలంలో ఎదురయ్యే నష్టాలను గూర్చి కిషోర్ బాలికలకు తెలియచేసి ఆ గ్రామ పరిధిలో ర్యాలీ నిర్వహించాలని కోరారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించి మహిళల భద్రతకు ప్రభుత్వాలు కల్పించే వివిధ వనరులను ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జోగి వెంకటరమణ కే విజయ్ కుమారి, వీఆర్వోలు అంగనవాడీ కార్యకర్తలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు

విశాలాంధ్ర - సీతానగరం: రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు త్వరలో అందించనున్నామని వ్యవసాయశాఖ ఏ ఓ సూర్య రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు అభ్యున్నతికి తోడ్పాటు అందించే విధంగా సబ్సిడీపై ట్రాక్టర్లకు ఉపయోగపడే పరికరాలు మండలానికి వచ్చాయి. ఈ పరికరాలలో రొటావేటర్లపై యాభై వేల రూపాయలు సబ్సిడీతో 15 పరికరాలు, పవర్ టిల్లర్లు లక్ష రూపాయలు సబ్సిడీతో 2 పరికరాలు, కల్టివేటర్ ఒకటి పరిమాణం బట్టి సబ్సిడీ వస్తుంది అన్నారు. త్వరలోనే అర్హులైన రైతులకు ఈ వ్యవసాయ పరికరాలు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అందించడం జరుగుతుంది అని అన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు క్రమబద్ధీకరణ

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండలం రాగోలపల్లి గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసం ఉంటున్న కుటుంబాల వారిని విచారించే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఇంచార్జి తహసీల్దార్ భారతి అధ్వర్యంలో రాగోలపల్లిలో 25 కుటుంబాలనుంచి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. నివాసాలు లేని పేద ప్రజలు ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో 2019కి ముందు నుండి నివాసం ఉంటే వారిని గుర్తించి క్రమబద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటామని భారతి తెలిపారు.

ఆర్టీసీ పీవోగా రవి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) రాజమహేంద్రవరం డిపిటివో శాఖకు పర్సనల్ అధికారి (పీవో)గా కె.రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అమలాపురం డిపిటివో పీవోగా బాధ్యత లు నిర్వహించిన రవి సాధారణ బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్సనల్ అధికారిగా రాజమహేంద్రవరం నుండే సేవలందించను న్నారు. ఈ సందర్భంగా రాజ మహేంద్రవరం లోని వివిధ శాఖల అధికారులు,సిబ్బంది ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్,
కొసమట్టం సిటీ సెంటర్, ఫ్లోర్ నెం. 4 అండ్ 5,
టి.వి. రోడ్డు, కొట్టయమ్, కేరళ-686001

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

Kosamattam కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్.,

ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా ఇక్కడ కొసమట్టం ఫైనాన్స్‌లో బంగారం మీద ఋణం, వడ్డీ కట్టక గడువు సమయం మించిపోయిన బంగారము క్రింద తెలుపబడిన జి.యల్.నెంబర్ల ప్రకారం బహిరంగంగా వేలం వేయుచున్నాము. ఈ వివరములు ముందే మేము మీకు రిజిష్టరు లెటర్స్ ద్వారా తెలిపియున్నాము. ఇదే వివరాలు ఏదైనా బ్రాంచిలో వేలము వేయుచున్నామో అదే బ్రాంచిలో జి.యల్.నెంబర్ల ప్రకారం నోటీసు బోర్డులో పెట్టడం జరిగింది.

బంగారం వేలం వేయు స్థలం : వేలం వేయు బంగారం వివరములు :

తూర్పు గోదావరి పరిధి : కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్, రాజమండ్రి బ్రాంచి, డోర్ నెం. 21-1-1, మొదటి అంతస్తు, తుమ్మలవ, దేవిచౌక్, కొర్లంపేట, రాజమండ్రి, తూ.గో. జిల్లా, ఏ.పి. పిన్: 533 101. **ఫోన్: 0883-2475827. తేది: 16-05-2025, మధ్యాహ్నం 2:00 గంటలకు.**

అమలాపురం: 5288 6293. **గొల్లప్రోలు** : 10415 10428 10444 10457 10484 10542 10559 11011 11061 11294 11349 11351 11452 11470 11958 11974 12010 12082 12088 12142 12291. **కత్తిపూడి** : 3472 3549 3578 3585 3588 3766 3829 3861 3867 3906 4551 4679. **మల్కిపురం** : 14168 14339 14789 14870 14896. **రాజమండ్రి** : 10883 10907 10908 10922 10925 10984 11048 11147 11280 11839 11908 11912 11985 12003 12012 12053 12056 12257. **కాకినాడ** : 6531. **తుని** : 15072 15079 15084 15122 15134 15162 15204 15270 15318 15360 15375 15396 15397 15446 15450 15464 15472 15479 15501 15554 15565 15566 15616 16267 16268 16269 16274 16291 16372 16382 16392 16393 16395 16397 16408 16413 16432 16433 16435 16455 16508 16512 16602 16615 16644 16669 16706 16724. **యానం**: 6454 6498 6512 6987.

నోట్: 1) వేలంలో పాల్గొనదలచినారు రూ. 1,00,000/- కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్ పేరుపైన ఆర్‌టిజిఎస్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఉ. 11. గం. లోపు డబ్బు డిపాజిట్ చేయాలి. వేలం తరువాత ఎవరు డిపాజిట్ చేస్తారో వారికి డబ్బు వెనక్కి ఇవ్వబడును. (2) వేలానికి వచ్చినవారు గుర్తింపు కార్డు, లేదా రెసిడెన్స్ ప్రూఫ్ కచ్చితంగా తీసుకుని రావాలి. లిస్ట్‌లో వున్న మొత్తం బంగారం చేప్పినరోజు వేలం వెయ్యకపోతే మరుసటి రోజు ఆఫీసు పనిచేయు వేళల్లో బంగారు వేలం వేయడానికి, వేలం సమయాన్ని ఎటువంటి నోటీసు ఇవ్వకుండా మార్చడానికి మా కంపెనీకి పూర్తి అధికారం ఉంది. వేలంలో బంగారం తీసుకున్న వారు 5 శాతం అదేరోజు కట్టాలి. ఒక వారం రోజులలో మిగతా నగదు కట్టి బంగారం తీసుకుని వెళ్ళాలి. తేది, స్థలం మార్చుటకు కంపెని వారికి సర్వహక్కులు కలవు. పూర్తి వివరాల కోసం **15-05-2025**వ తేదీ లోపు సంప్రదించగలరు. ఫోన్ : **0866-2435456**

తేది: 01-05-2025 విజయవాడ. అథరైజ్డ్ ఆఫీసర్, కొసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్.

12న కాకినాడలో మాలల మహా రణభేరి

విశాలాంధ్ర - సామర్లకోట : వర్గీకరణ ద్వారా ఏ కులానికి న్యాయం జరగదని మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ పందు అశోక్ కుమార్ పేర్కొ న్నారు. బుధవారం సామర్లకోట బలుసులపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నేతల హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అశోక్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పివి రావు 73వ జయంతి కార్యక్రమం సందర్భంగా కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మాలల మహా రణభేరి కార్యక్రమం మే 12న నిర్వహించినట్లు పేర్కొన్నారు. మాలలు రాజ్యాంగాన్ని రక్షించే విధంగా, అంబేద్కర్ ఆలోచన విధంగా వెళ్లడం జరుగుతుందని అటువంటి మాలలను అణగదొక్కేందుకు వర్గీకరణ చేపడుతున్నారని, వర్గీకరణ వలన ప్రతి ఒక్కరూ నష్టపోయే పరిస్థితి ఉందని అశోక్ బాబు పేర్కొన్నారు. అనంతరం నేతల హరిబాబు మాట్లాడు తూ చలో కాకినాడ భాగంగా మే 12న జరిగే మాలల మహా రణభేరి కార్యక్రమంలో సామర్లకోట పరిసర ప్రాంత మాలలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నేతల పేర్కొన్నారు. లింగం శివప్రసాద్, బుంగ సతీష్, ఖండవిల్లి లోవరాజు, నేతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలీ సెట్ పరీక్షలు

విశాలాంధ్ర - రాజానగరం : పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు ప్రభుత్వం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బుధవారం జరిగిన ఏపీ పాలిసెట్ 2025 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లోనూ,1793 మంది విద్యార్థులకు గాను1618 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 175 మంది గైహజ రైనట్లు పరీక్ష కేంద్రాల సూపర్వైజర్లు డాక్టర్ .పిజి. రామానుజం, టి.రామారావు చెప్పారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 860మంది విద్యార్థులకు గాను. 773 మంది, ఆర్ కె బ్లాక్ లో ఏర్పాటు చేసిన పరీక్షకేంద్రం లో 933 మంది కి గాను 845 మంది హాజరైనట్టు చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద రాజానగరం సిఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి ఎంఎంఎస్ శర్మ,డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు తదితరులు సందర్శించారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

విశాలాంధ్ర - కడియం : ఉపాధి హామీ పథకం ద్వారా కడియం మండలంలో చేపడుతున్న కాలువ పూడిక తీత పనులను బుధవారం ఎంపీడీవో కె. రమేష్ పరిశీలిం చారు. మురమండ ముత్యాలమ్మ గుడి వద్ద కాలువలో పూడికతీత పనిని పరిశీలించారు. ఆ కూలీల హాజరు నమోదు వివరాల రికార్డును తనిఖీ చేసారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని గ్రామ కార్యదర్శి రావిపాటి సత్యనారాయణకు ఎంపీడీవో రమేష్ సూచించారు.

పేరు మార్పు

జుత్తుగ లిల్లి (పాప) అను నేను అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామంలో నివసిస్తూ ఉంటాను నా పేరు జుత్తుగ లిల్లీ (పాప) అని అంటారు. బ్యాంకు బుక్‌లో పాపని వస్తుంది కానీ నా పేరు లిల్లీ (పాప) అని అంటారు. ఫోన్ నెంబర్ : 7993823760

మహారాజశ్రీ కాకినాడ 4వ అడిషినల్ జిల్లా కోర్టులో
O.S. No. 9 of 2019
Between :
గెడ్డం సూర్య కుమారి ...వాది
మరియు
కడియాల విష్ణుమూర్తి అండ్ అదర్స్ ..ప్రతివాదులు
6 : అమలదాసు దుర్గ, W/o. అప్పన్న, డో.నెం. 5-193/69, కాల్వ గట్టు, అవంతి నగర్, రమణయ్యపేట, కాకినాడ.
7 : అమలదాసు రాజు, S/o. అప్పన్న, డో.నెం. 5-193/69, కాల్వ గట్టు, అవంతి నగర్, రమణయ్యపేట, కాకినాడ.
8 : అమలదాసు దావీదు, S/o. అప్పన్న, డో.నెం. 5-193/69, కాల్వ గట్టు, అవంతి నగర్, రమణయ్యపేట, కాకినాడ. 6 to 8 Defendents
పై నెంబరు దావాలో 6 to 8 ప్రతివాదులైన మీకు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినప్పటికి మీకు అమలు జరిగి యుండలేదు. కావున మీ హాజరు నిమిత్తం కోర్టు వారు ది.09-05-2025 తేదీనాటికి వాయిదా వేసియున్నారు ఆ రోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా కాని హాజరయ్యి మీకు ఆక్షేపణలున్న యెడల తెలుపుకోనవచ్చును. లేని యెడల దావా మీ పరోక్షమున తీర్మానించెదరు.
అద్దేపల్లి మురళీధర్, పిటీషనర్ తరపు అడ్వకేట్
కాకినాడ. ప్రతాప్ నగర్, కాకినాడ
ది.29-04-2025 సెల్: 9849170270

పలు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలుమున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ హాల్ పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. అజెండలోని పలు తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. రెండో వార్డ్ కౌన్సిలర్ ఆలమూరు భారతి మాట్లాడుతూ శిథిలావస్థ చేరిన రామాలయాన్ని నిర్మించే నిమిత్తం దాన్ని తొలగించారని తిరిగి ఆలయాన్ని ఇంత వరకు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో శ్రీరామ నవమి సందర్భంగా పలువురు భక్తులు పూజలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడ్డారంటూ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. స్పందించిన ఏ ఈ హేమంత్ నెల రోజుల్లో ఆలయాన్ని నిర్మించడం జరుగుతుందని సభకు తెలిపారు. వైయస్సార్ కాలనీలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయుటకు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి సాధారణ నిధుల నుండి 35 లక్షలు ఖర్చు చేయడంపై కౌన్సిలర్ కామిశెట్టి సత్తిబాబు ప్రశ్నించారు. ఆ నిధులను హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుండి రాబట్టేందుకు అధికారులు కృషి చెయ్యాలన్నారు. 22వ వార్డు వజీరుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన నేటికీ వైయస్సార్ విగ్రహా ముసుగు తొలగించక పోవడం పై అధికారులు నిలదీశారు. అలాగే వివిధ సమస్యలపై పలువురు మాట్లాడారు. కాశి రేవు సుందరీ కరణ పనులు. కైలాష్ భూమికి వంతెన నిర్మాణం, కాశీ రేవుకు రాకపోకలు సాగించేందుకు అనువైన మార్గాన్ని నిర్మించడానికి ఆర్ అండ్ బి నిధులు లేదా పుష్కర గ్రాంట్ నిధులు మంజూరు కాగానే ఆ పనులు ప్రారంభించనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా కమిషనర్ తెలిపారు. ఎజెండా లోని తీర్మానాలను ఆమోదించడంతో అధ్యక్షస్థానంలో ఉన్న వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి సభను ముగించారు. ముందుగా కాశ్మీర్లో ని పెహల్ గామ్ లో జరిగిన ఉగ్ర దాడిని ఖండించి మృతులకు సంతాపాన్ని పాటించారు.

సబ్సిడీతో సూర్యఘర్ యోజన సోలార్ యూనిట్

విశాలాంధ్ర - అనపర్తి/పెదపూడి : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని ఎంపిడివో కొవ్వూరి నరేంద్ర రెడ్డి, ఏపిఓ అరుణ తెలిపారు. బుధవారం పెదపూడి ఐకెపి వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ద్వాక్రా మహిళలకు అయితే వారి స్త్రీ ధనము నుండి తక్కువ వడ్డీకి వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించే అవకాశం కల్పించడం జరిగిందని అదేవిధంగా అదేవిధంగా పూర్తిస్థాయిలో బ్యాంకు రుణాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో కే నరేంద్ర రెడ్డి, ఎమ్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ ఇంధన వనరులు దుర్వినియోగం చేయడం వల్ల భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. సోలార్ ప్యానెల్ వన్ సోలార్ ప్యానెల్ వలన ఎంతో ఉపయోగం కలుగుతుందని, మండల కార్యాలయానికి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిఇ, ఏఇలు కృష్ణమూర్తి, వీర వెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 పదవీ విరమణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మహమ్మద్ పచ్చా సాహెబ్, మండల విద్యాశాఖ అధికారి -2 పదవీ విరమణ ఘనంగా నిర్వహించారని మండల విద్యాశాఖాధికారి-1 అన్నారు. సాహెబ్ 15 ఏప్రిల్ 1963న కాకినాడలో జన్మించి, 19 ఫిబ్రవరి 1986వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం యందు సెకండరీ గ్రేడ్ టీచర్గా ప్రస్థానం మొదలుపెట్టి, తదనంతరం జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు విచ్చేసి, అంచలంచలుగా పదోన్నతులు పొంది సామర్లకోట మండలం జి మేడపాడు జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల యందు గెజిటెడ్ ప్రధానోపాధ్యా యునిగా చేశారన్నారు. తదుపరి జూన్ 20, 2023న మండల విద్యాశాఖ అధికారి-2గా ఆత్రేయపురం మండలం యందు నియమి తులైనారు. ఆయన ఎంతోమంది ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉండి వృత్తి నైపుణ్యాల పెంపొందించుటలో విశేషమైన కృషి చేశారన్నారు. మహమ్మద్ పచ్చా సాహెబ్‌ను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సర్వశిక్ష సిబ్బంది పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి స్వరూప్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిమళ కుమారి, మురళీకృష్ణ, ఎస్‌వివిఎన్ఎస్ ప్రసాద్, దొరబాబు, రామకృష్ణ, వెంకటరాజు తదితరులు సన్మానించారు.

క్రీడాకారులకు అభినందనలు

విశాలాంధ్ర - రాజానగరం : రాజస్థాన్‌లోని పిండ్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్‌మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ వర్సిటీ క్రీడాకారులు సత్తాచాటి తొమ్మిది పతకాలు కైవసం చేసుకున్నారు. దీంతో మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం అభినందన సభ నిర్వహించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 వరకు రాజస్థాన్‌లోని పిండ్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్‌షిప్‌లో తమ వర్సిటీ అనుబంధ డిఎన్ఆర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారన్నారు.ఆల్ ఇండియా రూప్ స్కిప్పింగ్ మెన్ పోటీలలో పురుషుల విభాగంలో ఐదు పతకాలు, మహిళా విభాగంలో నాలుగు పతకాలు సాధించారన్నా రు. చక్కని ప్రతిభ కనబరిచిన ఆర్.ఏసు పసిడి మరియు రజిత పతకాలు, కె.వేణు సాయి రెండు రజిత పతకాలు, ఎం. లీలా గణేష్ ఒక రజిత పతకం సాధించారన్నారు. మహిళా విభాగంలో జె.గాయత్రి, ఎం నాగదేవి, సిహెచ్ సాయి లలిత, ఎస్ఆర్. గంగాభవాని లు ఒక్కొక్క పసిడి పతకం సాధించారని తెలిపారు. క్రీడాకారులను రిజిస్ట్రార్, సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ ఆచార్య జి సుధాకర్, కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు విశ్వవిద్యాలయం అధికారులు అభినందించారు.

'కిషోరీ వికాసం'పై అవగాహన

విశాలాంధ్ర - కడియం : పరిస్థితులు ఎలాంటివైనా బాల్యవివాహాల వలన అనర్థాలు తప్పవని, బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని పిహెచ్సీ వైద్యాధికారిణి మణి జ్యోత్స్న, సిఎఆర్ఎఫ్ రాజ్ కుమార్ అన్నారు. కడియం పంచాయతీ కార్యాలయంలో బుధవారం "కిషోరి వికాసం" పేరుతో అవగాహన ఐసిడిఎస్ శిరీష, ఐసిటిఎస్ సూపర్వైజర్ సత్యశ్రీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ మణి జ్యోత్స్న, సిఎఆర్ఎఫ్ రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ అక్షయ తృతీయ నుంచి పెళ్లి ముహూర్తాలు ఉంటాయని, బాల్యవివాహాలు జరగకుండా ఆపడానికి, ఆడపిల్లల ఆధిపత్యం పెంపొందించడానికి 'కిషోరి వికాసం' పేరుతో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించిందని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం లు, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామికి విరాళాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం పలువురు భక్తులు బంగారు, వెండి ఆభరణాలు, నగదు విరాళాలుగా సమర్పించారు. విశాఖపట్నంకు చెందిన శ్రీ వెంకట కృష్ణ అన్నమాచార్య సంస్థ సభ్యులు 46 గ్రాముల బంగారంతో చేయించిన 2 మంగళ సూత్రాలు, ఒక కేజీన్నర వెండి పళ్లెం శ్రీదేవి భూదేవికు, స్వామికి సమర్పించారు. ఒక భక్తురాలు స్వామికి నిలువ దోపిడి సమర్పించుకున్నారు. సీతానగరం మండలం, వెదుళ్ళపల్లికి చెందిన కొత్తపల్లి దొరబాబు, సుధారాణి దంపతులు, రమేష్ చంద్ర కుటుంబ సభ్యులు ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి రూ. 1,00,700 విరాళంగా అందజేసారు. దాతలకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, పులపర్తి రాంబాబు వర్మ, ఆలయ సూపరెంటెంట్, రాపాక శ్రీనివాస్ టెంపుల్ ఇన్స్పెక్టర్, తదితర అధికారులు ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటాలు అందజేసారు.

లైంగిక వేధింపుల నివారణపై శిక్షణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై ఈరోజు జిల్లా విద్యశాఖ వారికి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారికి మరియు ఎన్జీవోలకు ఓరియంటేషన్ (పునా చ్చారణ) కార్యక్రమాన్ని రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి ట్రైనింగ్ పొందిన సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ హాజరయ్యి పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు వాటిని ఏ విధంగా అరికట్టాలి అనే అంశం మీద తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు మన అందరి పైన ఉందని ఆర్ బి ఎస్ కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హరిచంద్ర వివరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోమల, జిల్లా విద్యాశాఖ అధికారి కే. వాసుదేవరావు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ, డైస్ మేనేజర్ సతీష్, డైస్ సిబ్బంది. వివిధ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ

విశాలాంధ్ర - కడియం : ఈరోజు ఉదయం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద వృద్ధులకు ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ సత్య దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులకు దివ్యాంగులకు నిరాశ్రయులకు గొడుగులకు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దాతలు. జి జయకుమార్. జి జయప్రద దంపతులు హాజరై వృద్ధులకు దివ్యాంగులకు నిరాశ్రయులకు గొడుగులు. భోజనాలు స్వీట్లు పంపిణీ చేశారు. జై కుమార్ జయప్రద దంపతులు మాట్లాడుతూ. మా అమ్మగారు. జి సూర్యామణి జ్ఞాపకార్థం ఈరోజు వృద్ధులకు దివ్యాంగులకు గొడుగులు పంపిణీ చేయడం జరిగిందని, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ సత్య చేస్తున్న సేవలు అభినందనీయమని, ట్రస్ట్‌కు మేము ఎప్పుడూ తోడు గా ఉంటామని, గొడుగులు పంపిణీ చేస్తుంటే వృద్ధులు దివ్యాంగుల కళ్ళల్లో ఆనందంఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. వృద్ధులు దివ్యాంగులు నిరాశ్రయులు. ట్రస్ట సభ్యులు కెవిఆర్ సాగర్. బి దుర్గా. పాల్గొన్నారు

చిన వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు : మధు

విశాలాంధ్ర- పెరవలి : చిన వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తూర్పుగోదావరి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. బుధవారం మండలంలో ఖండవల్లి గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకులు చినవెంకటరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మధు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు చినవెంకటరెడ్డి మృతిచెందడం పార్టీకి తీరని లోటు అన్నారు. ప్రతీ ఒక్కరు జీవించిన కాలంలో వారు చేసినమంచి పనులవలననే గొప్పవ్యక్తులుగా పిలవబడతారని అటువంటి గొప్పవ్యక్తి చినవెంకటరెడ్డి అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మనమందరము ముందుకు వెళ్లాలన్నారు. అంతే కాకుండా ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు మనమందరము కృషి చేయాలాన్నారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శి కొనాల బీమారావు మాట్లాడుతూ చినవెంకటరెడ్డి కమ్యూనిస్టు పార్టీలో ఎన్నో కార్యక్రమాలలో పాల్గొన్నారని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబానికి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పలువురు మాట్లాడుతూ చినవెంకటరెడ్డి మృతిచెందడం గ్రామానికి తీరని లోటన్నారు. గ్రామంలో ఎన్నో కార్యక్రమాలలో ఆయన ముందుండేవారని ఎటువంటి సమస్యనైనా చాలా సున్నితంగా పరిష్కరించేవారన్నారు. పంటలలో నూతన పద్ధతులను ఆయన అవలంభించి రైతులకు మేలు రకాల వంగడాలపై అవగాన కల్పించేవారన్నారు. ఈ సమావేశములో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు, పంతం నాగేశ్వరరావు, శ్రీనువాస్ పాల్గొన్నారు.

1.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

విశాలాంధ్ర - ఏలూరు: రైతుల నుంచి ఇంతవరకు 1.84 లక్షల మెట్రిక్ టన్నుల రబీ ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లాజాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రబీ ధాన్యం కొనుగోలు,సిఎంఆర్ రైస్‌పై రైస్ మిల్లుల యాజమాన్యాలతో,పౌర సరఫరాల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ రబీ 2024-25 రైతుల నుండి ధాన్యం సేకరణలో భాగంగా తొలుత 1.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించారని, అయితే జిల్లా యంత్రాంగం వారి సూచనల మేరకు ధాన్యం దిగుబడి ఎక్కువ వున్నందున జిల్లా టార్గెట్‌ని 2.లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం జరిగిందన్నారు. తదుపరి జిల్లా వ్యవసాయ అధికారి, ఏలూరు వారి నివేదిక ప్రకారం ధాన్యం దిగుబడి ఎక్కువ వున్నందున జిల్లా యంత్రాంగం మరో 20 వేల మెట్రిక్ టన్నులకు అధనపు లక్ష్యాన్ని కేటాయించడం జరిగిందన్నారు. దీంతో ఏలూరు జిల్లా లక్ష్యం 2.00 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2.20 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఓపెన్ మార్కెట్ నందు 677.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. ఓపెన్ మార్కెట్లో ధాన్యం కొనుగోలును పెంచాలని జాయింట్ కలెక్టర్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలని, లేని యెడల రైస్ మిల్లుల యాజమాన్యం పై తగు చర్యలు తీసుకోబడతా యన్నారు. ప్రస్తుతం జిల్లాలో వున్న అన్నీ రైతు సేవాకేంద్రాల ద్వారా 44,53,250 గోనె సంచు లను రైతులకు సరఫరా చేసి జిల్లాలో 1.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులు కోరిక మేరకు పెంచిన లక్ష్యానికి అనగా ప్రస్తుతానికి 0.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి,9 లక్షల గోనె సంచులను అవసరమై వుందన్నారు. రైతు సేవాకేంద్రాల వద్ద అదనంగా 11,82,696 గోనె సంచులు రైతులకు అందుబాటులో వుంచడం జరిగిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు తగిన ఏర్పాట్లు జిల్లా యంత్రాగం చేసివుందని, దానికి టార్పాన్లు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజరు పివిఎస్ఆర్ మూర్తి,డిఎస్ఓ ప్రతాప్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి,పలువురు రైస్ మిల్లుల అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎంఇజీపీ యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రధాన మంత్రి ఉపాధికల్పనా కార్యక్రమం కింద మంజూరైన యూనిట్లు స్థాపనపై దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామీణ,అర్బన్ ప్రాంతాల్లో నిరుద్యోగ యవతకు పిఎంఇజిపి కింద మంజూరైన ఉపాధి యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ప్రోత్సహించే దిశగా జిల్లాలో కనీసం 30 స్వయం సహాయక గ్రూపులతో యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరులో కార్పెట్ క్లస్టర్ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే భూమికి సంబంధించిన అంశాలు పూర్తయినందున తదుపరి విద్యుత్, ఎన్ఓసి విషయాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటిడిఏ పరిధిలో దాల్ మిల్, జీడిగింజల పరిశ్రమ, చింతపండు, తదితర యూనిట్ల స్థాపనకు చొరవచూపాలని ఐటిడిఏ, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సింగిల్ విండో కింద దరఖాస్తు చేసుకున్న 33 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో 23 మంది పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదం తెలిపింది. జిల్లాలోని గుర్తించిన 51 పరిశ్రమలను డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌తో కూడిన బృందం స్పెషల్ డ్రైవ్ నిర్వహించిందని వాటిలో 47 పరిశ్రమలు పనిచేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ఓఎన్‌డిసి కార్యక్రమం కింద వివిధ యూనిట్ల స్థాపనలో భాగంగా ప్రతి మండలంలో ఆ మండలంలో అనువైన ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపనకు సంబంధించి మే 15వతేదీ నాటికి యూనిట్ల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పీడీ ఆర్. విజయరాజు, ఎల్డిఎమ్ నీలాద్రి, కార్మిక శాఖ ఉప కమిషనర్ పి. శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు, నాబార్డు డిడిఎం టి. అనీల్‌కాంత్, ఐటిడిఏ పిఓ రాములునాయక్, ఏపిఐఐసి జెడ్ఎం కె. బాబ్జి, తదితర అధికారులు పాల్గొన్నారు.

బిజీలు పెంచాలంటున్న మిల్లర్లు

- సంచులు ఇవ్వటం లేదంటున్న రైతులు
- ఈ పరిస్థితి తూర్పుగోదావరికి మాత్రమేనా?

విశాలాంధ్ర తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలోని రైతాంగం తను పండించిన ధాన్యం ఎక్కడకు పంపాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన బిజిలుకు అనుమతి ఇవ్వక పోవడంతో రైస్ మిల్లర్లు ఇక ధాన్యం కొనేది లేదు అంటూ తెగేసి చెబుతున్నారు. ఈ విపత్కర పరిస్థితి తూర్పు గోదావరి జిల్లాలో మాత్రమే ఉందని సమాచారం. 1:2 నిష్పత్తిలో బి.జి లు అనుమతిస్తామని మొదట్లో ప్రభుత్వం చెప్పిన మాట. తూర్పు గోదావరిలో అది అమలు కావటం లేదన్నది నగ్న సత్యం. ఇక గతాన్ని పోల్చుకుని ధాన్యం తప్పక మిల్లుకు పంపవచ్చని భావించిన రైతుకు ప్రస్తుత పరిస్థితి మింగుడుపడటం లేదు. తాళ్లపూడి మండలం లోని పలు ప్రాంతాల్లో సాయంత్రం సమయం లో వస్తున్న భారీ గాలులతో కూడిన వర్షం కు ధాన్యాన్ని కాపాడుకోలేని స్థితి ఎదుర్కొంటున్నారు. వేసవి వచ్చాక మొదటి సరిగా తాళ్లపూడి మండలంలో వర్షం కురవడంతో వరి పండించిన రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మామిడి ఇతర రైతాంగం కష్టాలు మామూలే, దీనికి తోడు ఆర బెట్టిన ధాన్యం తడిచిపోయిన పరిస్థితి ఎక్కువగా కనబడింది. గజ్జరం అన్నదేవరపేట గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రోడ్ మీద ఆర బోసిన ధాన్యం తడిసి ముద్దైంది. వర్షం నీటిని గాదులు తీసి తొలగించే ప్రయత్నం చేపట్టారు. ఈ ప్రాంతంలో అంతా కౌలు రైతులు. రైస్ మిల్లర్లు సంచులు సకాలంలో ఇవ్వక పోవటం వల్లనే తమ రైతులు ఇబ్బందులు పడుతున్నామని తాడిపూడికి చెందిన కౌలు రైతు పడాల పోసియ్య, పైడిమెట్టకు చెందిన రైతు బోడపాటి ప్రసాద్ అనే రైతులు వాపోయారు. ధాన్యం కోతలు ప్రారంభంలో ఇచ్చినట్లుగా ఇప్పుడు సంచులు ఇవ్వటం లేదని వారు పేర్కొన్నారు. చేలో ధాన్యం, రోడ్డు పై ఆర బెట్టిన ధాన్యం కూడా తడిసి రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు.

దుర్గేష్‌కి సీఎం ఆల్ ది బెస్ట్

విశాలాంధ్ర - నిడదవోలు : వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు, మంత్రి కందుల దుర్గేష్‌కి అప్పగిస్తూ పీఎంవో ఆదేశాలు జారీ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాద పూర్వకంగా కలిసిన మంత్రి కందుల దుర్గేష్ నేడు న్యూఢిల్లీకి బయలుదేరుతున్న క్రమంలో నిర్వహణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచిస్తూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆల్ ది బెస్ట్ తెలిపిన సీఎం మే 1 నుండి 6 వరకు వియత్నాం పర్యటనలో మంత్రి దుర్గేష్ వుంటారు.

6న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - రాజోలు : వికాస, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభి వృద్ధి సంస్థ సౌజన్యంతో A1 సేవా సమితి అధ్యక్షులు, చెల్లుబోయిన శ్రీనివాస్ సహకారంతో మే నెల 6 మంగళవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు దేవ వర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మలికిపురం ఎమ్మెల్యే కార్యాలయం నందు ఆయన చేతుల మీదుగా జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. సుమారు 37 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, 1000కి పైగా ఉద్యోగాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాస్, నైపుణ్యాభి సంస్థ జిల్లా మేనేజర్ హరితేషు, వికాస జిల్లా మేనే జర్ గొల్ల రమేష్, సఖినేటిపల్లి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవ కేంద్రాల్లో మద్దతు ధర

విశాలాంధ్ర - కాజులూరు : రైతు సేవ కేంద్రంలోని మద్దతు ధర లభిస్తుందని కాజులూరు మండల వ్యవసాయ అధికారి వి అశోక్ తెలిపారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారి అశోకు ఒక ప్రకటనలో తెలుపుతూ, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతు సేవా కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని రైతులు, కౌలు రైతులు, రైతు సేవ కేంద్రంలో ఉన్న సిబ్బందికి తమ ధాన్యాన్ని తేమ శాతం పరీక్షించుకున్నాక 17% లోపు ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. మద్దతు ధరతో పాటు ఖర్చులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు సేవ కేంద్రంలో మద్దతు ధర లభించకపోయినట్లయితే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

ప్రధాని పర్యటనను జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రధాన మంత్రి పాల్గొనే అమరావతి రాజధాని పునఃనిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మే 2న ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. రవాణా,త్రాగునీరు సదుపాయం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా సభా వేదికకు చేరుకోవడం వంటి సన్నాహక ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా నుండి 300 బస్సుల్లో 13,250 మంది తరలి వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాన మంత్రి పర్యటనలో భాగంగా జిల్లా ప్రజలను ఆయా బస్సుల్లో పంపేందుకు విధులను కేటాయించిన ప్రతిఒక్క అధికారి,సిబ్బంది,బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు.